ప్రజాశక్తి
శనివారం 8 మార్చి 2025

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో రెవెన్యూ డివిజన్‌లో అధికారులతో విజన్ ప్రణాళికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గం ఎలా అభివద్ధి చేయాలి ఏ విధంగా ప్రణాళికలు అమలు చేయాలి.. ప్రతికూల, సానుకూల అంశాలపై సమగ్రంగా నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో పరిశ్రమలు స్థాపించేందుకు స్థల సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చర్చించి కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. సోలార్ పార్క్ ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాలలో వ్యవసాయ అనుబంధ రంగాల, పారిశ్రామిక, టూరిజం సర్క్యూట్‌లను పరిశీలించాలన్నారు. జిల్లాలోని గిరిజన కాలనీలకు రోడ్లు అనుసంధానం ఉండేవిధంగా పనులు చేపట్టాలని అందుకు మండలాల వారీగా గిరిజనుల కాలనీల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మహేష్, శర్మ, స్పెషల్ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిఇఒ కృష్ణప్ప, సిపిఒ విజయ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆమెపై అఘాయిత్యాలు..!

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు... అన్నింటా పురుషులతో సమానమేనని ఎన్ని మాటలు వల్లెవేసినా ఆచరణలో కనిపించడం లేదు. ఆమెపై అణచివేత, అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒంటరిగా బయటేకాదు.. కుటుంబంలోనూ సురక్షితంగా ఉండలేని దయనీయ స్థితి నెలకొంది. బాధితులుగా మారిన వారికీ ప్రభుత్వ పరంగా అందుతున్న సహాయమూ, తోడ్పాటు నామమాత్రంగానే ఉందన్న విమర్శలూ ఉన్నాయి.

◆ శిక్షల అమల్లో జాప్యమే

◆ బాధితులకు అందని పరిహారం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పరిధిలో మహిళలపై ఏటా హింస పెరుగుతూనే ఉంది. ఏటా నమోదవుతున్న నేర గణాంకాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఏటా మహిళలపై హింస సగటున ఎనిమిది శాతముంటోంది. 2022లో మహిళల పట్ల నమోదయిన కేసులు 248 కాగా, 2023లో అవి 730కు చేరాయి. 2024లో మరో ఎనిమిది శాతం కేసులు పెరిగాయి. జిల్లా మొత్తంగా నమోదవుతున్న నేరగణాంకాల్లో అత్యధికంగా మహిళలపై హింసకు సంబంధించనవే అధికంగా ఉంటున్నాయి.

బాధితులకు న్యాయమేది

మహిళలపై ఏదైనా అఘాయిత్యం జరిగితే మూడు వారాల్లో శిక్ష పడే విధంగా చేస్తామని 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు దిశా చట్టాన్ని తెచ్చారు. ఆచరణలో అవేవీ అమలు జరగలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వంద రోజుల్లోపు నిందితులకు శిక్ష ఖరారు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని హోంమంత్రి అనిత ప్రకటించారు. ఈ రకంగా ప్రకటనలుంటున్నాయి కానీ ఆచరణే నామమాత్రంగా ఉంటోందన్న విమర్శలున్నాయి. 2020 డిసెంబరు 24న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం సమీపంలో ఒక యువతిని అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ కేసు ఇంకా విచారణ దశలోనే ఉంది. అప్పట్లో పెద్దఎత్తున ఈ అంశంపై ఆందోళనలు జరిగాయి. దీన్ని తాత్కాలికంగా సద్దుమణిచేందుకు కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగమిచ్చారు. కాని నిందితులకు ఇంకా శిక్ష పడలేదు.

కొందరికే పరిహారం

పోక్సో చట్టం కింద కేసు నమోదయినప్పుడు వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు, న్యాయం కోసం పోరాడేందుకు సహకారం అందించే ప్రత్యేక వ్యవస్థ ఉంది. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ బాధ్యతలను నిర్వర్తించాలి. కేసు నమోదయినప్పుడే అఘాయిత్య తీవ్రతను బట్టి పరిహారాన్ని రూ.1.50 లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు పరిహారం అందివ్వాలని ఉంది. ప్రాథమికంగా 25 శాతమే మొదట బాధితులకు అందివ్వాలి. ఆ తరువాత పూర్తి ఆర్థిక సహాయాన్ని అందివ్వాల్సి ఉంటుంది. జిల్లాలో కేసులు నమోదయినప్పటికీ ఈ రకమైన ఆర్థిక సహకారం, తోడ్పాటు అందిన వారి సంఖ్య నామమాత్రంగానే ఉండటం గమనార్హం.

చలో అసెంబ్లీ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

కాటికాపర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కాటికాపర్ల సమస్యలపై నిర్వహిస్తున్న చలో అసెంబ్లీ పోస్టర్లను కరపత్రాలను స్థానిక సిఐటియు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు మల్లయ్య, రాజప్ప, గంగాధర్, సరస్వతి, చంద్రమ్మ మాట్లాడుతూ తరతరాల నుంచి శ్మశానంలో నిస్వార్థంతో పనిచేస్తున్న కాటికాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఈ నెల 11వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ దగ్గర నిర్వహిస్తున్న మహా ధర్నా కార్యక్రమానికి కాటికాపర్లందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

'పన్నులు వసూలు చేయకుంటే తొలగిస్తాం'

◆ ఆర్‌పిలకు కదిరి మున్సిపల్ ఉన్నతాధికారి హెచ్చరిక

◆ అధికారి తీరుతో చిరుద్యోగుల్లో భయం

◆ పన్నుల వసూళ్లకు ఆర్‌పిలను బాధ్యుల్ని చేస్తారా..? : సిఐటియు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

'మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడమే మీ పని కాదు.. పన్నుల వసూళ్లను కూడా చేయాలి. లేకుంటే మీపై చర్యలు తీసుకోక తప్పదు'. అంటూ కదిరి మున్సిపల్ అధికారి ఆర్‌పిలను హెచ్చరించిన వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. కదిరి పట్టణంలో ఇంటి పన్ను, నీటి పన్నులు వసూలు చేయకపోతే డ్వాక్రా గ్రూప్ ఆర్పీలను తొలగిస్తామనే పద్ధతిలో మున్సిపల్ ఉన్నతాధికారి మాట్లాడిన ఆడియోపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పన్నుల వసూలు చేయకుంటే డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన పనులు నిర్వహించే రిసోర్స్ పర్సన్ ఆర్‌పిలను ఇంటికి పంపుతాం అనేలా ఆయన మాట్లాడారు. పన్నులు వసూలు చేయడానికి ప్రత్యేక విభాగం ఉందనే విషయాన్ని సదురు అధికారి మార్చిపోయి ఆర్‌పిలే చేయాలనే విధంగా మాట్లాడడం విస్మయానికి గురి చేస్తోంది. పేద మహిళలు ఆర్థికంగా బలపడేందుకు రుణాలు ఇప్పించే పనులు చేస్తున్న ఆర్‌పిలు అదే మహిళలను పన్నుల కోసం డిమాండ్ చేయాలని ఆదేశించడం ఏంత వరకు సమంజసమని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఆర్‌పిలు రాజకీయ వేధింపులతో తీవ్ర సతమతం అవుతున్నారు. ఇలాంటి సమయంలో అధికారులు కూడా పన్నులు వసూలు చేయాలని హెచ్చరికలు చేస్తుండడం వారిని మరింత ఆందోళనకు గురి చేస్తోంది. సదరు అధికారి తీరుతో పట్టణంలో మహిళలకు డ్వాక్రా రుణాల మంజూరులో తీవ్ర జాప్యం జరిగే అవకాశం ఉందని డ్వాక్రా సంఘం సభ్యులు చెబుతున్నారు.

అటకెక్కుతున్న అభివృద్ధి

మున్సిపాల్టీ ఉన్నతాధికారి అభివద్ధి భారాన్ని మొత్తం తానే మోస్తున్నా అనేలా ఆయన వ్యవహార శైలి ఉంటుందనే భావన కన్పిస్తోంటోంది. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లో అభివద్ధికి సంబంధించి ఆమోదం కోసం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కదిరిలో మాత్రం సదరు అధికారి తీరుతో గత నెలలో తూతూమంత్రంగా మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ బడ్జెట్ ప్రణాళికలు పూర్తి స్థాయిలో తయారు చేయలేకపోయారు. ఈ విషయంపై కౌన్సిల్ సభ్యులు సమావేశంలోనే అసహం వ్యక్తం చేశారు. అధికారులు ప్రవేశపెట్టిన బడ్జెట్ అజెండాపై కౌన్సిల్ సభ్యుల నుంచి ఆమోదం లభించలేదు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పొరపాట్లను కిందస్థాయి సిబ్బందిపై నెట్టివేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇటీవల చిరుద్యోగులు, కార్మికులకు ఛార్జ్ మెమోలు, వేతనాల్లో కొత విధిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున వీధి దీపాలు వేయించలేని పరిస్థితి కదిరిలో ఉంది.

ఆర్‌పిలపై బెదిరింపులు తగదు

పట్టణంలో పన్నుల వసూళ్లు చేయాలంటూ చిరుద్యోగులైన ఆర్‌పిలను మున్సిపల్ అధికారి బెదిరించడం సరికాదు. పన్నుల వసూలు చేయడం ఆర్‌పిల బాధ్యత కాదు. చాలీచాలని వేతనాలు, రాజకీయ వేధింపులతో సతమతం అవుతున్న ఆర్‌పిలకు అధికారులు అండగా ఉండాల్సింది పోయి ఇలా వ్యవహరించడం సరికాదు. గత ప్రభుత్వంలో చెత్తసేకరణకు పన్నులు వసూలు చేశారు. అయినా పట్టణంలో చెత్తతొలగింది లేదు. పట్టణంలో చాలా వార్డుల్లో మౌలిక సమస్యల లేమితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటి పరిష్కారంపై మున్సిపల్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. అలా కాకుండా చిరుద్యోగులపై బెదిరింపులకు పాల్పడితే ప్రతిఘటన తప్పదు.

జిఎల్.నరసింహులు, సిఐటియు

రైతుల పొలాలను పరిశీలించి వారితో మాట్లాడుతున్న భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రావు

హైడల్ ప్రాజెక్టులోకి వెళ్లకుండా భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రావును అడ్డుకుంటున్న అదానీ సిబ్బంది

అదానీ సిబ్బంది బరితెగింపు

పరిశీలనకు వెళ్లిన అధికారుల అడ్డగింత - అనుమతుల్లేవ్ వెనక్కు వెళ్లాలంటూ హుకుం

ప్రజాశక్తి-తాడిమర్రి

అదానీ యాజమాన్యం బరితెగించింది. ప్రభుత్వ అధికారులను సైతం పరిశీలన చేసేందుకు వీల్లేదంటూ వారి పరిసరాల్లోకి కూడా రాకుండానే అడ్డుకున్నారు. వారి అడ్డగింపుతో అధికారులు కూడా ఏమి చేయాలో తెలియక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలోని దాడి తోట చిల్ల కొండయ్యపల్లి, పెద్దకోట్ల గ్రామ సరిహద్దుల్లో అదాని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో గత కొద్ది నెలల నుంచి చిల్ల కొండయ్యపల్లి గ్రామంలో దాదాపుగా 120 మంది రైతుల బోరు బావుల్లో నీటి మట్టం తగ్గింది. కొద్దిపాటి నీరుతో పంట పొలాలు కాపాడుకోలేక నూతన బోరు బావులు వేయిస్తున్నప్పటికీ చుక్క నీరు పడని పరిస్థితి నెలకొంది. చిల్లకుండాయపల్లి గ్రామ రైతుల ఆవేదనను తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, తదితరులు గురువారం నాడు గ్రామంలో పర్యటించారు. రైతుల పొలాలను పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సిపిఎం నాయకుల పర్యటన నేపథ్యంలో రైతుల కష్టాలు పత్రికల్లోనూ ప్రచురితం అయ్యాయి. దీనిపై స్పందించిన సత్యసాయి జిల్లా భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రావు తన సిబ్బందితో శుక్రవారం నాడు చిల్లకొండాయపల్లి గ్రామంలో పర్యటించారు. రైతుల పొలాలను పరిశీలించి వారితో మాట్లాడారు. రైతుల ఇబ్బందులను పూర్తి స్థాయిలో పరిశీలన చేసి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రైతులకు తెలిపారు.

అదానీ సిబ్బంది అడ్డగింత

రైతుల పొలాల పరిశీలన అనంతరం డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున అదాని హైడల్ ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లారు. ప్రాజెక్టు ప్రారంభం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అదానీ యాజమాన్యం అధికారి వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రాజెక్టు లోపలికి వెళ్లేందుకు వీల్లేదంటూ వారిని వెనక్కు పంపేశారు. ఆదానీ సిబ్బంది బరితెగింపుతో చేసేది లేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

"షి" బాక్సును కలెక్టర్ కు అందిస్తున్న నాయకులు

మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం ఏపీ జెఎసి అమరావతి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలసి మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి "షీ" బాక్స్' ఏర్పాటు చేయాలని ఉద్యోగుల సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కార్యాలయంలోని ఏవో విభాగం వద్ద ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. "షి" బాక్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేయడం ప్రత్యేకంగా మహిళల కోసం ఈ బాక్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు జేఏసీ నాయకులు కతజ్ఞతలు తెలిపారు. అనంతరం జేఏసీ నాయకులు మహిళ ఛైర్‌పర్సన్ విజయభారతి, నాయకులు మైముద్దీన్, జివైపి.రావు, జిల్లా అధ్యక్షులు గీతాంజలి తదితరులు మాట్లాడుతూ "షి"బాక్స్ వల్ల మహిళా ఉద్యోగులు ఉద్యోగ పరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు రాత పూర్వకంగా ఆ బాక్స్‌లో వేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మధు నాయక్, సుభాషిణి, రమాదేవి, ప్రభావతి, మెప్మా రమాదేవి, కండక్టర్ అమీనా భాను పాల్గొన్నారు.

బకాయి వేతనాలు మంజూరు చేయించండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండలం గోళ్లాపురం పారిశ్రామిక వాడలోని ఓస్వెల్ స్మెల్టర్స్ స్టీలు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు బకాయిపడ్డ వేతనాలు మంజూరు చేయించాలని శుక్రవారం కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తూమకుంట కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ వలస వచ్చిన కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి కార్మికులకు వేతనాలు ఇచ్చేలా చూడాలని కోరారు.

మహిళా సాధికారతే ధ్యేయం

2కే రన్ ప్రారంభంలో ఛైర్మన్, డీఎస్పీ, కమిషనర్

2కె రన్ లో పాల్గొన్న అధికారులు, మహిళలు

ప్రజాశక్తి-హిందూపురం

మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ.రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, డీఎస్పీ వీకే.మహేష్‌లు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హిందూపురం పట్టణంలో పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. స్థానిక గుర్నాథ్ సర్కిల్ వద్ద మున్సిపల్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. రన్ అనంతరం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ మహిళలు ఎన్నో విశిష్టమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు సమస్యలు వచ్చినప్పుడు నిరాశకు గురై కంగిపోకుండా ధైర్యంగా వాటిని ఎదుర్కొని పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ శాంతి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, మంజుళ, సునీత రెడ్డి, నాగమణి, రాష్ట్ర కురుబ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు పరిమళ, బేవినహళ్లి ఆనంద్ కుమార్, విజయలక్ష్మి, మెప్మా డిఎంసి గంగులయ్య, సిఒలు, ఆర్‌పిలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పూలకుంట ఐసిడిఎస్ కార్యాలయంలో..

మహిళలు మహోన్నతంగా రాణించాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, సిడిపిఒ శాంతి పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం మండలం పూలకుంట ఐసిడీఎస్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థినులతో కరాటే మాస్టర్లు

ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థినులు ఆత్మ రక్షణ విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధానోపాధ్యాయులు సుధామణి, వహీదా ఖానం, మధుసూదన్ రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ముదిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, చౌడేశ్వరి కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్లు విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధిద్దాం

అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ సంఘం శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంను స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉన్నత స్థానం, ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు పట్టణ ప్రజలతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలసి కట్టుగా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. హిందూపురం పట్టణంలో పచ్చదనం, పారిశుధ్యం, స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు చేయాల్సిన ప్రణాళికలపై కమిషనర్ శుక్రవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనం, పరిశుభ్రత పెంచడంలో చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని, కుటుంబాలను వదిలి పెట్టి పనులు చేస్తున్నారన్నారు. అధికారులు కూడా పారిశుధ్యం పనులపై దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహించే అందరికీ వైర్‌లెస్ సెట్లు ఇస్తామన్నారు. పచ్చదనం, పారిశుధ్యం, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హిందూపురం ఉత్తమ ర్యాంకు సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆరోగ్య అధికారి శోభన్ రెడ్డి, ఎఈ శంకర్ పాల్గొన్నారు.

హంద్రీనీవా వెడల్పు చేయకుండా లైనింగ్‌కు టెండర్లా?

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వి.రాంభూపాల్

హంద్రీనీవాను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని, పంట కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని రైతులు కోరుతుంటే లైనింగ్ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలవడం సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హంద్రీనీవాను వెడల్పు చేయకుండా అత్యంత వెనకబడిన అనంతపురం, సత్యసాయి జిల్లాలను ఎలా అభివృద్ధి చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి 6300 క్యూసెక్కుల కంటే ఎక్కువ నీరు తెస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం ఖరారు చేసిన టెండర్లలో 3850 క్యూసెక్కులకే పరిమితం చేయడం, రెండవ దశ కాలువ లైనింగ్ పనులకు సిద్ధపడడం చూస్తుంటే ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు ఉందన్నారు. లైనింగ్ పనులను రాప్తాడు ఎమ్మెల్యే కూడా వ్యతిరేకిస్తున్నందున మిగిలిన ఎమ్మెల్యేలు కూడా వారి వైఖరి ప్రకటించాలన్నారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఆయకట్టును స్థిరీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ముఖ్యమంత్రితో సానుకూల నిర్ణయం ప్రకటింప చేయాలన్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ

ప్రజాశక్తి-హిందూపురం

రక్త నిర్ధారణ చేస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ మహిళా ఎన్ఎస్ పిఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం హిమోగ్లోబిన్, రక్త వర్గాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి తెలిపారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అనంతపురం ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్ర విభాగపు అధ్యాపకురాలు డా॥శ్రీదేవి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు, రక్త వర్గాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటేశులు, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ ఎ.అమరేష్, జంతు శాస్త్ర విభాగపు అధ్యాపకురాలు జమీలా కౌశర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై 10న కలెక్టరేట్ ముట్టడి

ఎపి రైతు సంఘం నాయకులు

విలేకరుల సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రైతుల సమస్యలపై ఈ నెల 10వ తేదీ చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎపి రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్.హెచ్.బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహాదేవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు మొండి చేయి చూపారన్నారు. అన్నదాత సుఖీభవ ఊసే లేదని, రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో ఉన్నాయన్నారు. జిల్లాలో 32 మండలాలకు గానూ 15 మంది ఏఈలు మాత్రమే ఉన్నారని, దీంతో రైతులు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కావున అన్ని మండలాలకు ఏఈలను నియమించి, వ్యవసాయానికి పగటిపూట నిరంతర విద్యుత్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాడిమర్రి మండలంలో అదానీ సంస్థ చేస్తున్న విధ్వం సాన్ని అడ్డుకోవాలన్నారు. సన్న, చిన్న కారు రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు, సౌర పరికరాలు పూర్తి సబ్సిడీతో ఇవ్వాలన్నారు. రైతుల ప్రధాన సమస్యలపై సోమవారం చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిలో జిల్లాలోని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు అంకె ఆదినారాయణ, మారుతి, ముత్యాలప్ప, రామ్మోహన్, హైదర్‌వలి, ఎల్.ఆదినారాయణ, రమణ, హరి, తదితరులు పాల్గొన్నారు.

బిసి హాస్టళ్లకు నిధులు కేటాయించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

నియోజకవర్గంలో ఉన్న బిసి సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి శాసనసభ ప్రశ్నోత్తరాల సమ యంలో ప్రభుత్వాన్ని కోరారు. 5 హాస్టళ్లకు ప్రభుత్వ భవనాలు లేవని, 7 హాస్టళ్లకు ప్రహరీలు లేవని, 12 హాస్టళ్లలో ఆర్ఒ ప్లాంట్స్ లేవని, మరికొన్ని హాస్టళ్లలో మరుగుదొడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కా రానికి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. బుక్కపట్నంలో అర్ధాంతరంగా ఆగిన బిసి వెల్ఫేర్ బాలికల వసతి గృహ నిర్మాణ పనును పూర్తి చేసేందుకు వెంటనే రూ. 3 కోట్లు మంజూరు చేయాలన్నారు. వాటిపై బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత సానుకూలంగా స్పందించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గుడిబండ

వైసిపి హయాంలో చేపట్టిన సమ్మె కాలపు ఒప్పందాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఎమ్మార్సీ కార్యాల యంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, హెచ్ఆర్ పాలసీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు శ్రీనివాసులు, ఆనంద్, తిప్పేస్వామి, భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశం ప్రస్తావనపై హర్షం

వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి

ప్రజాశక్తి-కదిరి టౌన్

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంపై శుక్రవారం వాల్మీకి, బోయ సామాజిక వర్గం ప్రజల తరఫున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి, బోయ సామాజిక వర్గం ప్రజలు 60 ఏళ్ల నుంచి ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గతంలో ఒడిసిలో పర్యటించిన సందర్భంలో బంగారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు ఆనంద్, శివప్రసాద్, నరసింహులు, అంజనాదేవి, ప్రమీల, నాగవేణి, శ్రీరాములు, మనోహర్, మల్లికార్జున, అందరూ పాల్గొని వినతి పత్రం అందజేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యే బిసి, ఈబిసి కేటగిరీకి చెందిన అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ నిర్మల జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు కార్యాలయంలో లేదా 93921 41545 కు ఫోన్ చేయాలన్నారు.

హుండీ ఆదాయం రూ. 62.7 లక్షలు

ప్రజాశక్తి-కదిరిటౌన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన హుండీలను శుక్రవారం ఈవో వెండిదండి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు లెక్కించారు. వాటిలో 47 రోజులకు గానూ రూ. 62,73,741 నగదు, 20 గ్రాముల బంగారం, 340 గ్రాములు వెంటి వస్తువులు, 55 యుఎస్ఎ డాలర్లు ఉన్నట్లు ఈవో తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారిగా ఎన్.ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, కెనరా బ్యాంకు మేనేజర్ అనంత్‌బాబు, సిబ్బంది, వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణలపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తహశీల్దార్ కళ్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొందరు స్థిరాస్తి వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అనధికార లేఅవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కల్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగాధర్, మాట్లాడుతూ మండలంలోని కప్పలబండ రెవెన్యూ గ్రామ పొలంలో జ్యోతిర్లింగం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోందన్నారు. కొందరు ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపట్టగా గతంలో అప్పటి తహశీల్దార్ నోటీసులు ఇచ్చి నిర్మాణాలను ఆపించార న్నారు. ప్రస్తుతం కొందరు రియల్ వ్యాపారులు అనధికార లేఅవుట్లలో పేదలకు ప్లాట్లు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రజాప్రయోజనాలకు వినియోగించుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఆ పార్టీ మండల కార్యదర్శి శంకర్, నాయకులు చంద్ర, తదితరులు ఉన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని బిసి, ఈబిసి, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 18-50ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మోప్మా అధికారి పెనుబోలు విజయ్‌భాస్కర్, అధికారులు ఉన్నారు.

ఆక్రమణ భూములపై అధికారుల విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-చిలమత్తూరు

భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మండలంలోని కొడికొండ, కోడూరు, నారేముద్దపల్లి, మర్రిమాకులపల్లి రెవెన్యూ పొలాల్లో భూ ఆక్రమణలపై శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఫిబ్రవరి 28వ తేదీ ప్రజాశక్తి దినపత్రికలో 'రియల్టర్ ఆక్రమణ' పేరిట ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బెంగుళూరుకి చెందిన ఓ రియల్టర్ ఆక్రమణలో ఉన్న భూములపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆక్రమణలో ఉన్న భూములను గుర్తించి ఆ భూములపై సమగ్ర నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు డిప్యూటి తహశీల్దార్ జగన్నాథ్ తెలిపారు. ఈ మేరకు మండల సర్వేయర్ కోదండరామ్, సీనియర్ అసిస్టెంట్ నేలకోటప్ప, వీఆర్వో శాంతమ్మ, తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికను సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత ప్రభుత్వ భూములు, వంక పోరం బోకు భూములు, రైతులకి సంబంధించిన అసైన్డ్ భూములు కంచె లోపల ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ రిపోర్ట్‌ని ఉన్నతాధికారులకి పంపనున్నట్లు తెలిపారు.

ఈ క్రాప్ బుకింగ్ తనిఖీ

ప్రజాశక్తి-గోరంట్ల

ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జెసి అభిషేక్‌కుమార్

మండలంలోని తిప్పరాజుపల్లి గ్రామంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు వ్యవసాయ అధికారులు ఈ క్రాప్ బుకింగ్ చేపట్టారు. ఈ క్రమంలో అధికారులు శుక్రవారం రైతు నరసింహారెడ్డి పొలంలో వరి పంటను ఈ క్రాప్ బుకింగ్ చేస్తుండగా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. పంట దిగుబడిపై జెసి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పంటనూ ఈ క్రాప్ బుకింగ్ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జెసి వెంట తహశీల్దార్ మారుతి, ఎడిఎ అల్తాఫ్‌అలీఖాన్, ఏవో వంశీకృష్ణ, వీఆర్వో అనిల్, ఆర్ఎస్‌కె సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంతో పాటు మండల పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు ఫిర్యాదు చేశారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే వినయ్ కుమార్ మాట్లాడుతూ రూరల్ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీలు నిర్వహిస్తున్నార న్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్నారు. కొందరు స్థానిక నాయకులు తహశీల్దార్ ద్వారా అక్రమంగా పొజిషన్ సర్టిఫికెట్లు పొందారన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పలువురు నివాసాలు కోల్పోగా, కొందరు నాయకులు వారిని సాకుగా చూపించి విలువైన ప్రభుత్వ భూమిని కాజేయాలని చూస్తున్నారన్నారు. బత్తలపల్లి తహశీల్దార్ ఒకే సామాజిక వర్గానికి చెందిన ఏడుగురికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారని విమర్శించారు. ఇళ్లు కోల్పోయిన వారిలో ఎస్సీ, బిసిలు కూడా ఉన్నారని, విచారణ చేపట్టి అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పశంసాపత్రాలు అందుకుంటున్న హోంగార్డులు

విధుల్లో నైపుణ్యాలు మెరుగుపరచుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని రాయలసీమ రీజియన్ ఇన్‌ఛార్జి హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ సూచించారు. పట్టణం లోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం హోంగార్డ్స్ పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ ముందుగా పరేడ్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ హోంగార్డు విధులు సవాళ్లతో కూడుకున్నవని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండాల న్నారు. ఆరోగ్యంగా ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలమని, కావున ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్ రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి, లేదా ఆర్ఐ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు, సాదక బాధకాలు విని, వాటికి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి, ఆర్ఎస్ఐ వీరన్న, ప్రదీప్‌సింగ్, హోంగార్డులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-బుక్కపట్నం

జెసిబితో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి డైట్ విద్యార్థుల క్రీడోత్సవాల కోసం స్థానిక డిగ్రీ కళాశాల మైదానం ముస్తాబవుతోంది. ఇందు లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న డిగ్రీ కళాశాల భవనం పక్కన ఉన్న మైదానంలో శుక్రవారం మేజర్ పంచాయతీ సర్పంచి కత్తి నాగలక్ష్మిరాజు ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో జెసిబి ఏర్పాటు చేసి ముళ్లపొదలను తొలగించి చదును చేసే పనులు చేపట్టారు. సర్పంచి మాట్లాడు తూ గ్రామంలో జరిగే డైట్ కళాశాల రాష్ట్రస్థాయి పోటీలకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి, పోటీలను దిగ్విజయం చేస్తామని తెలిపారు. కార్యక్ర మంలో పంచాయతీ సెక్రటరీ సాధిక్‌వలి, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులు

ఆత్మరక్షణ విద్యలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక కెజిబివిలో ఎస్ఒ శిరీష, జడ్పీ బాలికల హైస్కూల్‌లో హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్య(సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులు)ను ప్రారంభించినారు. వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు, యువతులు, బాలికలపై లైంగిక వేధింపులు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇప్పిస్తుందన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు బాలికలు తమను తాము రక్షించుకునేందుకు ఆత్మరక్షణ విద్యలు దోహదం చేస్తాయన్నారు. అలాగే విద్యార్థినుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పిఇటిలు సుజాత, పి.షఫీ, సంధ్యారాణి, కరాటే మాస్టర్ షేక్షావలి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పివిఎస్ స్కూల్‌లో ఘనంగా రొబోటిక్స్ డే

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రొబోటిక్స్ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులు

స్థానిక పివిఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు తయారుచేసిన రొబోటిక్స్ నమూనాలను ప్రదర్శనకు ఉంచారు. పాఠశాల ఛైర్మన్ పివి.నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, సహజ సామర్థ్యాలను వెలికితీసే ఉద్దేశంతో విద్యార్థులకు రొబోటిక్స్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు శిక్షణను చక్కగా ఉపయోగించుకొని అద్భుతమైన నమూనాలను తయారుచేసి ప్రదర్శించడం గర్వంగా ఉందన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతి కోసం సలహాలు, సూచనలు స్వీకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన రొబోటిక్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో కందుల నాణ్యతను పరిశీలిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

30 వరకు కందుల కొనుగోలుకు గడువు

ప్రజాశక్తి-రొద్దం

రైతుల నుంచి కందుల కొనుగోలుకు ఈ నెల 30వ తేదీతో గడువు ముగుస్తుందని ఏజెన్సీ నిర్వాహకుడు వెంకటేష్ శుక్రవారం తెలిపారు. కావున రైతులు ఇంటి వద్దనే కందులను శుభ్రం చేసి నాణ్యమైనవి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రొద్దంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంలో ఏజెన్సీ సిబ్బంది నాణ్యతను పరిశీలించిన తర్వాతనే కందులను కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత తక్కువగా ఉన్న వాటిని కొనుగోలు కేంద్రం వద్దనే జల్లెడ పట్టి శుభ్రం చేయించి ఆ తర్వాత కొనుగోలు చేసి మార్క్‌ఫెడ్ కంపెనీకి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

12న పశువుల సంత వేలం

ప్రజాశక్తి-గుడిబండ

2025-26 సంవత్సరానికి గానూ పశువుల సంత, కూరగాయల సంత, దినసరి బస్టాండ్‌కు సంబంధించి స్థానిక సచివాలయంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు సర్పంచి కరుణాకర్, ఈవోఆర్డీ నాగరాజునాయక్, గ్రామ కార్యదర్శి ప్రకాష్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచా యతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. ఔత్సాహికులు పశువుల సంతకు రూ. 6 లక్షలు, కూరగాయల సంతకు రూ. లక్ష, దినసరి బస్టాండ్‌కు రూ. 50వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. గతంలో పంచాయతీకి ఎలాంటి బకాయి ఉండని వారే వేలంలో పాల్గొనేందుకు అర్హులన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని సానిపల్లి గ్రామ ఎంపియుపి పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దగువ్వలపల్లి జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు సరస్వతమ్మ, ఉపాధ్యాయురాళ్లు జయమ్మ, లక్ష్మినరసమ్మ, అమృత, ఎండిఎం ఏజెన్సీ నంజుండమ్మ, ఆయా లక్ష్మి దేవమ్మలను ఘనంగా సన్మానించారు. ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీనివాసులు విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కృష్ణానాయక్, మోహన్‌రెడ్డి, లక్ష్మినారాయణప్ప, సత్యమయ్య, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

రిషిక మృతదేహంపై పడి విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మండలంలోని బండ్లపల్లి క్రాస్ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక దుర్మర ణం చెందింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు.. జగనన్న కాలనీకి చెందిన వినోద్ కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో వినోద్ కూతురు రిషిక(9) రోడ్డు దాటుతుండగా పెనుకొండ వైపు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. వాహన డ్రైవర్ తప్పించుకొని వేగంగా వెళ్లిపోయారు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఇందిర తెలిపారు. బాలిక మృతదేహాన్ని పెనుగొండ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ పుట్టపర్తి జ్యుడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.రాకేష్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ధర్మవరం మండలంలోని ఉప్పునేసినపల్లి గ్రామానికి చెందిన భీమనేని అమర్ నాథ్‌నాయుడు చోరీలకు పాల్పడడంతో బుక్కపట్నం పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా ప్రాసిక్యూషన్ తరఫున ఎపిపి రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. ఆయా కేసుల్లో వేర్వేరుగా నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించారు. కాగా భీమనేని అమర్‌నాథ్‌నాయుడు 2021 అక్టోబర్ 25 నుంచి నుంచి జ్యుడిషియల్ రిమాండ్‌లో కొనసాగుతుండడం విశేషం. నేరం నిరూపించడంలో బుక్కపట్నం కోర్టు కానిస్టేబుల్ పెద్దిరెడ్డి కొండారెడ్డి పనితీరును, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్ విధి నిర్వహణను ఎపిపి అభినందించారు.

కదిరి పురపాలక సంఘం

"ఇ" ప్రొక్యూర్‌మెంట్

Tender Notice No:1444 to 1445/KDR/General Funds/E1, Dated:07.03.2025

క్రింద తెలిపిన పనులకు అర్హులైన వారి నుండి టెండర్లు పిలువడమైనది.

	పని పేరు	పనుల సంఖ్య	అంచనా మొత్తం
1.	General Funds	2 నెం.	రూ. 47.10 లక్షలు

ఆన్ లైన్‌లో షెడ్యూలు డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 08-03-2025 ఉ॥11.00 గం॥లకు
ఆన్ లైన్‌లో షెడ్యూలు డౌన్‌లోడింగ్ చివరి తేది: 24-03-2025 సా॥05.00 గం॥లకు
బిడ్ తెరిచే తేది: 24-03-2025 సా॥05.30 గం॥లకు

తదుపరి వివరములకు htpps://tender.apeprocurment.gov.in "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.

Note: Any addendum/Corrigendum/Bid Clarifications/Time extension shall be issued on the website only. No separate press notification shall be issued

కమీషనర్,
కదిరి పురపాలక సంఘం.
9849908160

'ఉపాధి' కూలీలకు వాటర్ బెల్ విధానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ ఏడాది వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఉపాధి హామీ పనుల ప్రదేశంలో కూలీలకు 'వాటర్ బెల్' విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిం దని ఎంపిడిఒ సాయిమనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలు గంటకోసారి నీళ్లు తాగేలా పని ప్రదేశాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే నీడ కోసం షెడ్లు సిద్ధం చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కూలీలు ఉదయం 6 గంటలకు పనులకు హాజరై 11 గంటల్లోగా ముగించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపిందన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), కదిరి

E.P.No:65/2017 in O.S. No:35/2009

Between:

A.V.రవింద్ర గుప్తా S/o Late అంబటి వెంకటరంగయ్య గుప్తా, Residing at D.No:4/96, దేవాలయం బజార్, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

...Decree Holder

మరియు

1.A.లలితరాణి W/o Dr.B.N.మూర్తి, హెడ్ మిస్ట్రేస్, శ్రీ శారద విద్యానికేతన్, కదిరి టౌన్ మరియు మండలం (died Rep.by Lrs.No.2 to 5)
2. A.నరసింహ మూర్తి S/o సుబ్రహ్మణ్యం,
3. A.విద్యాలత D/o A.నరసింహ మూర్తి
4. A.మధులత D/o A.నరసింహ మూర్తి
5. A.సుప్రియ D/o A.నరసింహ మూర్తి

All are residing at D.No:1/160, సోమగుట్ట వీధి, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

...Judgement Debtor

వేలం ప్రకటన

యావన్మంది ప్రజానికానికి తెలియజేయడం ఏమగనా పై E.P.లో జెడ్జిమెంట్ డెటార్ No.1 A.లలితరాణికి చెందిన క్రింది షెడ్యూలు దాఖలాఆస్తి, A.లలితరాణి గారి మరణాంతరం ఈమె వారసులైన J.Dr.No.2 to 5 కి సంక్రమించిన క్రింద కనపరిచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని, పై E.P.లోని డిక్రీ హోల్డర్ A.V.రవింద్ర గుప్తా గారి బాకీ వసూలు కొరకు, క్రింద కనపరిచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయుటకు పై కోర్టువారు నిర్ణయించారు.సదరు వేలం పై కోర్టులో 24/03/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకి నిర్వహించబడును. కావున ఆసక్తి గల వేలం దారులు పై కోర్టుయందు 24/03/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకి వేలంలో పాల్గొనవచ్చునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

SCHEDULE

శ్రీ సత్యసాయి జిల్లా, రిజిస్ట్రేషన్ జిల్లా హిందూపురం Now పుట్టపర్తి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కదిరి, కదిరి రెవెన్యూ గ్రామం, కదిరి మండలం మరియు మునిసిపాలిటీ ఏరియా,

1) **Govt Dry.** 549-2
2) **Govt Dry.** 551-3
3) **Govt Dry** 552-1 out of these Survey Numbers, Ac.28 cents full including, the building consisting of three floors bearing Door No.3-310-27-A, with old Assessment no.3744 new Assessment no.1005010140, and structures doors, windows, door frames, bore well, electric motor with HSC No.6202 etc., and with following

Boundaries;-
East: Land of Kutala Pulamma and others;
South: House bearing Door No.310-23;
West: Cart Tract;
North: Open place of Anjineyulu, etc.,;
D.Hr Value Rs.15,00,000/-
Amina Value Rs.50,00,000/-

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:24/03/2025
స్థలం:కదిరి

G.గురులింగస్వామి, B.A.,B.L,
Decree Holder తరుపు వకీలు, కదిరి.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, ANANTHAPURAMU

G.W.O.P. No:9/2025

(In the matter of grauting permission to the petition who is a natural guardian and elder brother of E.Narendra S/o Late E.Shankar to alienate the minor property schedule in the petition)

Between:

Erukala Sai Durga S/o Late E.Shankar, aged 24 years, R/o D.No:2-48, Vannappa Nagar, Gorantla, Sri Sathya Sai Dist. ...Petitioner

V/S

Nil ...Respondant

ప్రకటన

పై తెలిపిన కోర్టునందు పిటిషనర్ దాఖలు చేసిన అర్జీ మేరకు పిటీషనర్ తల్లిగారు అయిన E.లక్ష్మిదేవి W/o E.శంకర్ విక్రయం ద్వారా తేది 15/11/2018 మరియు 29/01/2019 కొన్న స్థలం నందు నిర్మించుకున్న ఇల్లు వున్నది.అయితే పిటీషనర్ తల్లి E.లక్ష్మిదేవి తేది. 26/10/2023 మరణించినారు. అలాగే పిటిషనర్ తండ్రి E.శంకర్ గారు 01/09/2024న మరణించుట వలన పిటీషనర్ తమ్ముడు అయిన E.నరేంద్రను పిటీషనర్ సంరక్షణలో ఉన్నారు.పిటీషనర్ తల్లిదండ్రులు మరణించుట వలన మైనర్ తమ్ముడు చదువులకు ఇతర సంరక్షణ బాధ్యతలకు అగు ఖర్చులకు గాను మైనర్‌కు సంబంధిం క్రింద కనబరిచిన పిటీషన్ షెడ్యూలు దాఖలా ఇల్లును అమ్ముటకు కోర్టు వారి పర్మిషన్ దాఖలు చేసుకొని అర్జీ మేరకు ఎవరికైన అభ్యంతరాలు ఉన్న యెడల పై తెలిపిన కోర్టు నందు 10/03/2025న ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కాని హాజరు అయి వారి ఆక్షేపణలు తెలుపగలరు.అట్లు ఆ దినం హాజరు కాని యెడల పిటీషన్ దాఖలు చేసిన అర్జీ మేరకు తీర్మానించబడును.

SCHEDULE

Property situated within Sri Sathya Sai District and RD and SRD of Chilamathur Within Gorantla Grama Polam and Mandal.

1. **Govt**.Dry **Sy.no**.277-2 **A.C**.6.75 out of it **A.C.** 1.00 out of it 120 Sq.Yards

Measuring:
East to West: 24 feet or 7.32 meters,
North to South: 45 feet or 13.725 meters,
Bounded by:
East: Property belongs to Poola Venkataramanappa
West: Property belongs to E.Lakshmidevi,
North: Property sold by S.Nirmala,
South: 15 feet road,

2. **Govt**.Dry **Sy.no**.277-2 **A.C**.6.75 out of it **A.C.**1.00 out of it 150 Sq.Yards

Measuring:
East to West: 10 yards or 9.14 meters,
North to South: 15 yards or 13.65 meters,
Bounded by:
East: Property belongs to Nirmala,
West: Property belongs to Nirmala
North: Property belongs to Ramadevi
South: 15 feet road,

Item No.1 and 2 total 270 Sq.Yards out of it building, ground floor, first floor and Second Floor.

Total Value Rs.30,00,000/-.

వాయిదా తేది:10/03/2025

P.V.SRINIVASA REDDY,
M.SUDHAKAR,
Advocates for Petitioners,
Hindupur.

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శర్మ

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆర్డీవో వివిఎస్ శర్మ పరిశీలించారు. మండలంలోని కుమ్మరవాండ్లపల్లి సమీపంలో ఉన్న స్పేస్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదులను తనిఖీ చేశారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 65 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ సత్యసాయి బాబా సేవా స్ఫూర్తితో విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ షామీర్, ఉపాధ్యాయులు మాణిక్యం ఇషాక్, నాగరాజు, సభ్యులు షాకీర్, మహమ్మద్ అలీ, సాధిక్, హన్ను, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

పాడి పరిశ్రమను ప్రోత్సహించడంలో భాగంగా వేసవిలో పశువులకు పచ్చిమేపు లభించేలా ప్రభుత్వం రాయితీపై గడ్డి విత్తనాలు ఇస్తోందని స్థానిక పశువైద్యశాల ఏడి శ్రీనివాసులు, వైద్యాధికారి గుర్నాథ్‌రెడ్డి తెలిపారు. బత్తలపల్లిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పశు వైద్యశాలతో పాటు డి.చెర్లోపల్లి పశువైద్యశాలలో సిఎస్‌హెచ్ -24 మల్టీ కట్ రకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీ పోనూ రైతు కిలోకు రూ. 23 చెల్లించాలన్నారు.

సెల్‌ఫోన్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న

నేడు సెల్‌ఫోన్ యుగం నడుస్తుందని, సెల్‌ఫోన్ వినియోగం పట్ల బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.రత్న సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో షార్ట్ ఫిలిం ద్వారా సెల్‌ఫోన్ వాడకం, సైబర్ నేరాలు, వాట్సాప్, వంటి వాటి వల్ల కలిగే అనర్థాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్ర మంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, ఆదినారాయణ, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం లేపాక్షి ఫౌండేషన్ అధ్యక్షులు యువకవి వడ్డి సుధాకర్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. సుధాకర్ మాట్లాడుతూ సమాజ మనుగడలో మహిళ ముఖ్యపాత్ర పోషిస్తుందని కొనియా డారు. ఈవోఆర్‌డి ప్రభుదాస్ మాట్లాడుతూ మహిళలే సృష్టికి మూలం అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, ఎపిఎం సువర్ణ, ఉపాధ్యాయులు అలీముల్లా, లేపాక్షి ఫౌండేషన్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నాటుసారా నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగ ముత్త య్య అధికారులను ఆదేశించారు. నవోదయం 2.0లో భాగంగా శుక్రవా రం మండలంలోని నార్సింపల్లితండా, అరుణగిరితండా, బాలేనాయక్ తండా గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికా రులు పర్యటించారు. వారు మాట్లాడు తూ నాటుసారా తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నాటు సారా తాగడం వల్ల కలిగే అనర్థాలు, దుష్ప్రభా వా లు, తయారీదారులు, విక్రేతలకు విధించే శిక్షల గురించి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, అధికారులు నాగరాజు, ఉమా మనోహర్‌రాజు, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలో నాటుసారా నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నాటుసారా నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ బి.బాబురావు, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, ఎక్సైజ్ సిఐ వీరారెడ్డి మాట్లాడుతూ నాటుసారా తయారీ చట్టరీత్యా నేరమని, సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బ్రహ్మయ్య, వీఆర్వోలు చంద్రశేఖర్, రమణ, క్రిష్టప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నంబులపూలకుంట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నాటుసారా నిర్మూలనపై అధికారులు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహశీల్దార్ దేవేందర్‌నాయక్, ఈవోఆర్‌డి మాధవరెడ్డి, ఎక్సైజ్ సిఐ వీరారెడ్డి హాజరై మాట్లాడారు. నాటుసారా తయారీ చట్టరీత్యా నేరమని, సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్, ఎస్ఐ వలిబాషా, అధికారులు పాల్గొన్నారు.

హరీష్ పాఠశాలలో ఘనంగా సరస్వతిపూజ

ప్రజాశక్తి-కదిరి టౌన్

హరీష్ పాఠశాలలో సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు

రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. పూజారి ప్రసాద్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హరీష్ స్కూల్స్ సెక్రెటరీ సాయికిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలపై 11న మహాధర్నా

ప్రజాశక్తి-రొద్దం

కాటికాపరులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీ విజయవాడలో చేపడుతున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కెవిపిఎస్ నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట కర పత్రాలు విడుదల చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎన్‌వి.రమణ, మండల కార్యదర్శి బాలు గంగా ధర్, గోవిందప్ప మాట్లాడుతూ కాటికాపరులకు బూట్లు, దుస్తులు, వారి పిల్లలకు ప్రయివేటు పాఠశా లలో ఉచిత విద్య, ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, తదితర డిమాండ్లపై మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. మహాధర్నాకు హాజరయ్యే వారు ఈ నెల 10వ తేదీ 3 గంటలకు ధర్మవరం రైల్వే స్టేషన్ చేరుకోవాలని తెలిపారు.

సేవాలాల్, మారెమ్మ విగ్రహాల ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని చెంచుగారిపల్లితండాలో శుక్రవారం మారెమ్మతల్లి, సేవాలాల్ విగ్రహాలను ప్రతి ష్టాపన చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున పూజా కార్యక్ర మాలు, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆచార్యుడు బ్రహ్మశ్రీ వట్టిపల్లి రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో రాజేంద్రప్రసాద్‌శర్మ, రాజేష్‌కుమార్‌శర్మ, రవితేజశర్మ వేద పండితులు, వారి బృందంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కెజిబివి తనిఖీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక కెజిబివిని శుక్రవారం ఎసిపి దేవరాజ్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పలు సమస్యలతో పాటు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయురాళ్ల మధ్య నెలకొన్న వివాదంపై ఆరా తీసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాగే జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు ఉన్నారు.

ఇతర విధులు కేటాయించొద్దని వైద్య సిబ్బంది వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఎఎన్‌ఎంలు, ఎంపిహెచ్‌ఎల చేత వైద్య ఆరోగ్య శాఖ విధానపరమైన పనులను మాత్రమే చేయించాలని, ఇతర వాటిని చేయించరాదని కోరుతూ తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగంకు వినతిపత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి నరేంద్రరెడ్డి, ట్రెజరర్ సురేంద్రనాయక్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నాసిరకం కోడిగుడ్ల సరఫరాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా పలు అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారని జై భీమ్‌రావు భారత్ పార్టీ సభ్యులు శుక్రవారం ఐసిడిఎస్ పిడి వరలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగరాజు మాట్లాడుతూ కొన్ని నెలల నుంచి హనుమాన్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, కదిరి, అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాల లకు నాణ్యతలేని కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే హనుమాన్ ట్రేడర్స్ కాంట్రాక్టర్‌ను రద్దు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రమేష్ ఉన్నారు.

ఐసిడిఎస్ పిడికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వైసిపి మండల కన్వీనర్‌గా రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-నల్లచెరువు

వైసిపి మండల కన్వీనర్‌గా మొండెం రవికుమార్‌రెడ్డిని నియమించినట్లు శుక్రవారం ఆయన తెలి పారు. ఈ పోస్టు కోసం పలువురు పోటీ పడ్డారు. చివరికు పార్టీ అధిష్టానం రవికుమార్‌రెడ్డికి అవకాశం కల్పించింది. ఈ విషయం తెలిసి మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలివచ్చి నూతన మండల కన్వీనర్ రవిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రవి మాట్లాడుతూ అందరినీ సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనకల్లు మండల కన్వీనర్ మబ్బు అశోక్‌రెడ్డిని రవికుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణనాయక్, భాస్కర్‌నాయుడు, అశోక్‌రెడ్డి, హైటెక్ రమణ, వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

12న 'ఫీజు పోరు' జయప్రదం చేయండి

వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ కలెక్టరేట్ ముందు చేపట్టనున్న 'ఫీజు పోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల నూతన కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన తన నివాసంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తప్పుడు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రధానంగా తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అధిష్టానం 'ఫీజుపోరు' కు పిలుపునిచ్చిందన్నారు. అందులో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.రమణారెడ్డి, కె.నరసింహా రెడ్డి, సుమియారఫీ, గంగన్న, సర్పంచి హైటెక్ రమణ, ఆదిమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, రఫీ, వై.ఆనంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్‌రెడ్డి, నాయకులు

అంధుల పాఠశాలలో కోతుల దాడి..

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి-పరిగి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి గోవర్ధన్

మండలంలోని కొడిగెనహళ్లి విభిన్న ప్రతిభావంతుల(అంధుల) పాఠశాలలో కోతులు దాడి చేయ డం వల్ల పదో తరగతి విద్యార్థి గోవర్ధన్ గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత మంగళవారం పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం ముగించుకుని తరగతులకు వెళ్తుండగా పాఠశాల ఆవరణలో ఉన్న కోతులు దాడి చేశాయి. అంధుడైన విద్యార్థి దిక్కుతోచని స్థితిలో కిందికి పడిపోవడంతో కుడి చేయి విరిగింది. గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన పాఠశాలకు చేరుకుని విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. విద్యార్థికి సుకృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.